సాక్షి అనకాపల్లి

శనివారం । 21 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అనకాపల్లి టౌన్: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఎస్పీ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు పోలీసు అమరవీరుల స్మృతి పరేడ్ ఉంటుందని జిల్లా పోలీస్ వర్గాలు శుక్రవారం తెలిపాయి.

సింగర్ ధీరజ్‌కు మలేషియా పురస్కారం



మలేషియా విశిష్ట కళా పురస్కారాన్ని అందుకుంటున్న సింగర్ ధీరజ్

నర్సీపట్నం: బాల గాయకుడు ధీరజ్‌కు మలేషియా విశిష్ట కళా పురస్కారం లభించింది. యునైటెడ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మలేషియాలో సిరం ఆడిటోరియంలో ఈ నెల 15న నిర్వహించిన సంగీత నృత్య సంబరాల్లో విశాఖపట్నానికి చెందిన సుప్రీం శేఖర్ ఆధ్వర్యంలో పాడుతా తీయగా విన్నర్ సూపర్ సింగర్ ధీరజ్, ఆర్ఆర్ఆర్ మూవీ ఫేం సింగర్ ప్రకృతి రెడ్డి తమ గాన మాధుర్యంతో అలరించారు. ధీరజ్ మలేషియా భాషలో పాడిన పాటలు అక్కడి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. దీనికి గాను మలేషియా విశిష్ట కళా పురస్కారాన్ని ఆ సంస్థ అధినేతలు పవన్, రామ ప్రదానం చేశారు. విదేశాల్లో గానాలాపనకు అవకాశం కల్పించిన సుప్రీం శేఖర్‌కు ఈ సందర్భంగా ధీరజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సింహగిరిపై ఘనంగా ఆయుధపూజ



స్వామివారి ఆయుధాలు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సింహవల్లీతాయారు సన్నిధిలో పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితర ఆయుధాలను ఉంచారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, ఆయుధ దేవాత ఆవాహనం, ఆరాధన నిర్వహించారు. ఆయుధాలకు విశేషంగా హారతులిచ్చారు. అనంతరం పూజలో ఉంచిన ఆయుధాలను సింహవల్లీ తాయారుకి అలంకరించారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తదితరులు పూజను నిర్వహించారు.

వాగ్దేవికి వందనం.. ఘనంగా ఘటాల మహోత్సవం



సరస్వతీదేవి అవతారంలో అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు. వీణాపాణిగా అలంకరించిన అమ్మను దర్శించి భక్తులు పులకించిపోయారు. అనకాపల్లి గవరపాలెంలో సతకంపట్టు కనకదుర్గమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు పుస్తకాలు, కలాలు, పలకలతో అమ్మవారిని పూజించారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమపూజలు, హోమం నిర్వహించారు. యలమంచిలి పద్మనాభరాజుపేట ఆలయంలో అభిషేకాలు, హోమాలు జరిపారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని భక్తిశ్రద్ధలతో హోమగుండం తొక్కారు. –అనకాపల్లి టౌన్/యలమంచిలి



చదువుల తల్లికి పూజలు చేస్తున్న విద్యార్థులు



యలమంచిలి మండలం పద్మనాభరాజుపేటలో అమ్మవారి ఘటాల ఊరేగింపు

అభివృద్ధి అంటే గ్రాఫిక్స్ కాదు..
ప్రజల కళ్లలో ఆనందం





సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- బతుకులు బాగుపడ్డాయి కాబట్టే మళ్లీ జగనన్నే రావాలని కోరుతున్నారు
- సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

నర్సీపట్నం: అభివృద్ధి అంటే గ్రాఫిక్స్ కాదని, పేదలందరి జీవితాల్లో సంతోషం నింపడమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేశారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నర్సీపట్నం మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకులు బాగుపడ్డాయి కాబట్టే జనం జగన్‌ను రెండోసారి సీఎం చేసుకోవాలని తీర్మానించుకున్నారన్నారు. విద్య, వైద్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. నాడు–నేడుతో పాఠశాలలు అభివృద్ధి చెందాయని, పేద విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సీఎం పునాదులు వేశారన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోటి 60 లక్షల కుటుంబాలు ఉంటే కోటి 15 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం తీసుకువచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలందరికీ గ్రామస్థాయిలో వైద్యం అందిస్తున్నామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంపై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ, ఎమ్మెల్యే గణేష్ అంటే ప్రత్యేక అభిమానం ఉన్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గణేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు, పవన్‌లు చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. దీని కోసం ఈనెల 26 నుంచి సామాజిక సాధికారిక బస్సు యాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లటమే ఈ యాత్ర ఉద్దేశమన్నారు. వచ్చే నెల 1 నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహించాలన్నారు. మీ ఇంటిలో లబ్ధి జరిగితేనే మాకు ఓటు వేయండని ప్రజలకు చెప్పాలన్నారు. జనవరి ఒకటి నుంచి సామాజిక పింఛన్లు రూ.3 వేలు చొప్పున అందిస్తున్నామన్నారు.

జగనన్న పేరు చెబితే చంద్రబాబుకు వణుకు

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ మాట్లాడుతూ రూ.1700 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు సేవలు అందించటంలో వలంటీర్లు ముందు వరుసలో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అనేక దోపిడీలకు పాల్పడ్డారని, జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే వారు హడలిపోతున్నారన్నారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సీఎం ప్రజలకు అండగా నిలిచారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి గ్రామస్థాయిలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మద్యం, గంజాయి మత్తులో అసభ్యంగా మాట్లాడే అయ్యన్నపాత్రుడు కావాలో.. మంచి నడవడిక కలిగిన ఎమ్మెల్యే గణేష్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నందుకు జగన్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు గోవిందరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ మండల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాస్, నాగేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీసా బేగం, కర్రి కనకమహాలక్ష్మి, కర్రి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, జిల్లా ఎస్సీ సెల్ మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతికూల పరిస్థితుల్లోనూ
రైతులకు అండగా..



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు

- రైతుల ఆర్థిక బలోపేతానికి తగిన చర్యలు
- వర్షాభావంపై వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, రైతుల ఆర్థిక బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వారు మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలు వలస పోకుండా పటిష్టమైన ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. తీవ్ర పంట నష్టం వాటిల్లే అవకాశం ఉన్న పాయకరావుపేట, నక్కపల్లి, బుచ్చెయ్యపేట మండలాల రైతులతో చర్చించి వారి జీవనోపాధి కోసం తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సూచించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులు ఈ విషయమై సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాభావ పరిస్థితిలో ఉన్న మండలాల్లో రైతులకు పశుగ్రాసం వేసుకోవడానికి విత్తనాలు వాయిదాలపై సరఫరా చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఎక్కువ మంది పాడి రైతులకు దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలని డీసీసీబీ అధికారిని ఆదేశించారు. మత్స్య శాఖ ద్వారా అమలవుతున్న చేపల మార్కెట్ హబ్ కోసం ల్యాండ్ కన్వర్షన్ మంజూరు కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లో వేయాల్సిన ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాలు, ఎరువుల సరఫరా మొదలైన వాటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాదరావు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో పనులు పూర్తి కావాలి



జోనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



జాతీయ రహదారి సుంకరమెట్ట జంక్షన్ వద్ద రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తూ..

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం

అనకాపల్లి టౌన్: జోన్ పరిధిలో రూ.13 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు, సెంటర్ లైటింగ్, ఫుట్‌పాత్ పనులు నెల రోజుల్లో పూర్తి కావాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. జోనల్ పరిధి జీవీఎంసీ విలీన గ్రామాలతోపాటు, పట్టణ పరిధిలోని పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యాలయానికి కావలసిన మౌలిక వసతులు ప్రభుత్వం సమకూర్చుతుందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా అవసరమైన చోట చెట్లను తొలగించినా పక్కనే మరో మూడు మొక్కలను నాటి వాటిని పర్యవేక్షించాలన్నారు. కాలువల్లో వర్షపు నీరు ప్రవహించే విధంగా రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేయాలని సూచించారు. జిల్లా మహిళా క్రీడాకారులకు స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో చేపట్టిన డార్మిటరీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ భవనాన్ని మరింత పెద్దదిగా నిర్మించాలని, ఇక్కడ వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలని, క్రీడాకారులు కూర్చునే గ్యాలరీల మరమ్మతులు, మైదానం చుట్టూ గేట్లు, ప్రధాన ద్వారం వద్ద ఆర్చి ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు నిధుల కోసం ఎస్టిమేషన్ వేయాలని దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నిధుల కోసం ఎంపీతో మాట్లాడుతామన్నారు. పవర్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఫ్లాట్ బోర్డులను నాణ్యతా ప్రమాణాలతో ఏర్పాటు చేయాలన్నారు. శారదానది ఒడ్డున శాంతి పార్కును పరిశీలించారు. అనంతరం జోనల్ కార్యాలయంలో దిగువ స్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ రవికృష్ణంరాజు, డిప్యూటీ డైరెక్టరు ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీలక్ష్మీ, టీపీవో జనార్ధనరావు, జీవీఎంసీ ఏఈ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా..
కార్పొరేట్ ఫిజియోథెరపీ

విమ్స్ పేరు వినగానే రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు గుర్తుకొస్తాయి. ప్రశాంత వాతావరణం, కార్పొరేట్ స్థాయి పడకలు, ఐసీయూ గదులు, వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఇక్కడి రోగుల సేవలకు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల వైద్య నిపుణులు సేవలు అందిస్తున్నారు. అతి తక్కువ ధరలకు సీటీ స్కానింగ్, ఎక్స్‌రే, రక్త రీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు ఉచిత ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

- విమ్స్‌లో స్పైనల్, న్యూరో రీహెబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు
- ఇక్కడి పరికరాలతోనే ఫిజియోథెరపీలో ఉచిత వైద్య సేవలు



వృద్ధురాలికి ఫింగర్ లేడర్, లేజర్ థెరపీ చేస్తున్న సిబ్బంది



విమ్స్‌లో రీహెబిలిటేషన్ సెంటర్

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కార్పొరేట్ స్థాయి ఆధునిక పరికరాలతో ఉచిత ఫిజియోథెరపీ సేవలను రోగులకు అందిస్తున్నారు. ఇటీవల స్పైనల్ అండ్ న్యూరో రీహెబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ఇందులో ఉన్న ఆధునిక పరికరాలను ఉపయోగించి అవసరమైనవారికి ఫిజియోథెరపీ సేవల్ని ఉచితంగా అందిస్తున్నారు. వీటితో పాటు ఇక్కడ స్పీచ్ థెరపీ, ఆడియో థెరపీ అందుబాటులో ఉంది. కోమా, పక్షవాతంతో బాధపడిన అనంతరం పూర్తి స్థాయిలో కోలుకోవడానికి ప్రత్యేక సేవలు అందిస్తున్నారు.

పక్షవాత రోగులకు ప్రత్యేక ఐసీయూ

పక్షవాతంతో బాధపడుతున్నవారికి ప్రత్యేక ఐసీయూ ఏర్పాటు చేశారు. ఇందులో ఆధునిక పడకలు అమర్చి ఇన్‌పేషెంట్ సేవలు అందిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈ సేవల్ని పొందాలంటే నెలకు కనీసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. విమ్స్‌లో మాత్రం ఈ సేవలు పూర్తిగా ఉచితమేనని వైద్యులు చెప్తున్నారు. వీటితో పాటు లేజర్ థెరపీ, కంటిన్యూయస్ పాసివ్ మోషన్(సీపీఎం) థెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ, ఎలక్ట్రో థెరపీ, సస్పెన్షన్ థెరపీ, మొబిలిటీ థెరపీ, ఇన్‌ఫ్రారెడ్(ఐఆర్ఆర్), ఆల్ట్రాసౌండ్, మజల్ స్టిమ్యులర్స్, ఇంటర్ ఫెరెన్షియల్ థెరపీ(ఐఎఫ్‌టీ), రోబోటిక్ గ్లౌజ్, టెన్స్, షార్ట్‌వేవ్ థెరపీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో ఉన్న యంత్రాలు

కార్పొరేట్ ఆస్పత్రులకు మించి, విమ్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేశారు. ట్రాక్షన్ మిషన్, సీపీ వాకర్, ఫింగర్ లేడర్, ఆల్ట్రా సౌండ్, ట్రెడ్ మిల్, స్పైన్ డీ ట్రాక్, మొబిలిటీ ట్రైనర్, స్టిమ్యులేటర్, ర్యాంప్ వాకర్, పేర్లాక్ బార్, స్టాటిక్ సైకిల్స్, షోల్డర్ వీల్, స్విల్ బాల్, పెగ్ బోర్డు, బ్యాలన్స్ బోర్డు, డంబెల్స్, వోబుల్ బోర్డు, థ్రెడ్ బ్యాండ్ తదితర యంత్రాలు వినియోగిస్తున్నారు. వీటిని విజయవాడ, హైదరాబాద్, ముంబయ్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి, ఇక్కడ ఏర్పాటు చేశారు.

దీర్ఘకాలిక రోగులకు వరం

ఈ కేంద్రంలో ఆరుగురు ఫిజియోథెరపిస్టులు అందుబాటులో ఉన్నారు. వారితో పాటు మరికొందరు సహాయక సిబ్బంది ఉన్నారు. దీర్ఘకాలంగా ఎముకల వ్యాధులతో బాధపడుతున్నవారు, కీళ్ల నొప్పులు, మెడ నొప్పులు, వెన్నుపూస నొప్పులు, ఆర్థరైటిస్ సమస్యలు, టెండాన్ సమస్య తదితర వాటితో బాధపడుతున్నవారికి అందుబాటులో ఉన్న ఆధునిక యంత్రాలను ఉపయోగించి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు ప్రమాదాలకు గురై, ఆపరేషన్ తర్వాత కాళ్లు, చేతులు కోల్పోయినవారికి రీహెబిలిటేషన్ కింద కృత్రిమ అవయవాలు అందిస్తున్నారు. పక్షవాత రోగులకు ప్రత్యేక థెరపీ ఇస్తున్నారు.



రీహెబిలిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీ

ఉచిత సేవల్ని వినియోగించుకోండి



విమ్స్‌లో ఈమధ్యనే స్పైనల్ అండ్ న్యూరో రీహెబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఉచిత సేవలు అందిస్తున్నాం. ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంచాం. ఇక్కడ ఉచితంగా అందించే థెరపీని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పొందాలంటే రూ.లక్షలు వెచ్చించాలి. పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్నవారి కోసం ప్రత్యేక ఐసీయూ సేవలు ఉచితంగా అందిస్తున్నాం. చెవిటి, మూగ బాధితులకు స్పీచ్, ఆడియో థెరపీ, కాక్లియర్ ఇంప్లాంటేషన్ జరిగినవారికి ప్రత్యేక స్పీచ్ థెరపీ అందిస్తున్నాం. ఆరుగురు ఫిజియోథెరపీ వైద్యులతో పాటు సహాయక సిబ్బందితో సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట

- గిరిజన గ్రామాల్లో సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి



స్థానిక ప్రజాప్రతినిధులతో రిబ్బన్ కట్ చేయించి సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. చింతలపూడి పంచాయతీ శివారు చినకోరాడ, పెద్ద కోరాడ, వంతెవానిపాలెంలో నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గతంలో ఇక్కడ పర్యటించిన డిప్యూటీ సీఎంను స్థానిక గ్రామాల గిరిజనులు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. రోడ్లు నిర్మించిన తర్వాతే ఆ గ్రామాలకు తిరిగి వస్తానని అప్పట్లో గ్రామస్తులకు ఆయన మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.20 లక్షల వ్యయంతో చినకోరాడ, పెదకోరాడ గ్రామాలకు సీసీ రోడ్లు, వంతెవానిపాలెంలో సీసీ రింగ్ రోడ్లను పూర్తి చేశారు. తాజాగా వాటిని ప్రారంభించి ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సీఎం జగన్ స్ఫూర్తితో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మారుమూల గిరిజన గ్రామాలకు సైతం తారురోడ్లు, సిమెంట్ రోడ్లు నిర్మించి, తాగునీటి వసతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వంతెవానిపాలెంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని స్థానికులు కోరగా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, గలేరి గంగరాజు, మాజీ ఎంపీటీసీ దొమ్మంగి సన్యాసమ్మ, తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



ఐసీడీఎస్ స్టాల్‌లో కోడిగుడ్డు సైజును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శుక్రవారం సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కోడి గుడ్ల పరిమాణాన్ని చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా వస్తారని, పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించాలని కోరారు. కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జెడ్సీ సుర వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా కార్యదర్శికి సూపర్ సర్పంచ్ వేధింపులు

- నిబంధనలకు విరుద్ధంగా బిల్లుల చెల్లింపునకు ఒత్తిడి
- ఆరోపించిన వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు
- ఎంపీపీ, ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ముస్లింనాయకులు

నక్కపల్లి: నిజాయితీగా పనిచేస్తున్న పెద దొడ్డిగల్లు మహిళా కార్యదర్శిని గ్రామ సూపర్ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న అప్పలరాజు అనే వ్యక్తి వేధిస్తూ బదిలీ చేయిస్తానని, సెలవుపై వెళ్లిపోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్‌బాబా, పలువురు ముస్లిం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో శ్రీనివాసరావులకు ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. సూపర్ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న అప్పలరాజు పంచాయతీలో గతంలో ఎప్పుడో ఎటువంటి అనుమతులు లేకుండా చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కార్యదర్శిపై ఒత్తిడి చేస్తున్నాడన్నారు. బిల్లు చెల్లింపులకు నిబంధనలు అంగీకరించవని మహిళా కార్యదర్శి చెప్పడంతో తన కున్న పలుకుబడితో ఆమెను బదిలీ చేయిస్తానని, లేదా స్వచ్ఛందంగా సెలవుపై వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆరోపించారు. దివ్యాంగురాలైన కార్యదర్శి ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి భయపడుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆమెకు రక్షణ కల్పించాలన్నారు. కాని పక్షంలో ముస్లింలంతా కలసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. ఈ ఆందోళనలో ఎంపీటీసీ గొర్ల దుర్గా గోవిందరాజు, నియోజకవర్గ మైనార్టీ విభాగం జనరల్ సెక్రటరీ ఎండీ ఇషాక్, కార్యదర్శి నాగూర్‌మీరా, మాజీ సర్పంచ్ షేక్ అన్సర్, గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు స్టీల్‌ప్లాంట్ బాబా, గౌస్, అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ సుకుర్, ముస్తఫా, మదీనా పాల్గొన్నారు.

ఒడ్డిమెట్టలో ట్రాక్టర్ చోరీ

నక్కపల్లి: మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో ట్రాక్టర్ చోరీకి గురయింది. గ్రామానికి చెందిన రైతు పయిల కృష్ణంరాజుకు తన ట్రాక్టర్‌ను మకాంలో ఉంచాడు. బుధవారం రాత్రి సమయంలో ట్రాక్టర్ ఇంజన్, తొట్టితో సహా చోరీకి గురయింది. బాధితుడు గురువారం ఉదయం లేచి ట్రాక్టర్‌ను పొలానికి తీసుకెళ్లేందుకు మకాం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ కనిపించలేదు. కొడుకు వరాలబాబుతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు కత్తిపూడి వరకు వెళ్లి గాలించినా ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో రైతు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన రోజు తెల్లవారుజాము 4 గంటలకు తుని సమీపంలో సీసీ టీవీ ఫుటేజీలో ట్రాక్టర్‌ను గుర్తించినట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు. అయితే నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధి దేవవరం, పాయకరావుపేట జంక్షన్ సీసీ టీవీ కెమెరాలు పనిచేయట్లేదని వాపోయారు. చోరీకి గురైన ట్రాక్టర్‌ను కనిపెట్టి అప్పగించాల్సిందిగా పోలీసులకు మొరపెట్టుకున్నట్లు బాధితుడు తెలిపారు.

400 కిలోల గంజాయి పట్టివేత



లారీ అడుగు భాగంలో అమర్చిన గంజాయి

మాడుగుల: మండలంలోని తాటిపర్తి చెక్‌పోస్టు వద్ద మాడుగుల పోలీసులు శుక్రవారం సాయంత్రం 400 కిలోలు గంజాయి పట్టుకున్నారు. ఎస్‌ఐ దామోదరనాయుడి కథనం మేరకు వివరాలు. ముందస్తు సమాచారంతో తాటిపర్తి చెక్‌పోస్టు వద్ద పోలీసులు మాటువేశారు. పాడేరు నుంచి ఖాళీగా వస్తున్న టాటా ఐషర్ వాహనాన్ని నిలిపి, అడుగు భాగంలో పరిశీలించగా గంజాయిని గుర్తించారు. పట్టుబడిన వాహనం, గంజాయిని స్వాధీనం చేసుకుని, వరంగల్ జిల్లాకు చెందిన పంజా సూరయ్యను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. అక్రమ గంజాయి తరలింపుపై గట్టి నిఘా ఉందని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కృష్ణం వందే జగద్గురుం షూటింగ్ ప్రారంభం



సినిమాకు క్లాప్ కొడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్లోని ఓ హోటల్లో కృష్ణం వందే జగద్గురుం సినిమా షూటింగ్‌ను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాన్వి ప్రొడక్షన్స్‌పై శెట్టి రాజేష్ నాయుడు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రజాదరణ పొందాలని అభిలషించారు. యువతరాన్ని ఆకట్టుకునే కథతో త్యాగరాజు, అంజలి(నూతన పరిచయం) హీరోహీరోయిన్లుగా కల్యాణి సత్యశ్రీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవంలో యూనిట్ సభ్యులు డీవోపీ అడ్డాడ శ్రీను, టైగర్ రాజా కస్తూరి, ఎరుకు నాయుడు, శెట్టి నాయుడు, మళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బత్తివానిపాలెం కూడలి వద్ద బోల్తా పడ్డ లారీ

కె.కోటపాడు: మండలంలోని బత్తివానిపాలెం కూడలి వద్ద రాయిని తరలిస్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంకన్నపాలెం మార్గం వైపు వెళ్తుండగా ఆంజనేయస్వామి ఆలయం సమీప మలుపులో అదుపుతప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు ఏమీ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

గిరిజన వర్సిటీకి మల్లుదొర, గంటందొర పేర్లు పెట్టాలి



అల్లూరి పార్కులో ఒక్క రోజు దీక్ష చేస్తున్న అల్లూరి సేవా సంఘం సభ్యులు

గొలుగొండ: గిరిజన విశ్వవిద్యాలయానికి స్వాతంత్ర్య సమర యోధులు గాం మల్లదొర, గాం గంటందొర పేర్లు పెట్టాలని కోరుతూ అల్లూరి పార్కులో అల్లూరి జాతీయ యువజన సంఘం సభ్యులు శుక్రవారం ఒక్క రోజు దీక్ష చేశారు. సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రం ఇటీవల రాష్ట్రానికి గిరిజన విశ్వ విద్యాలయాన్ని ప్రకటించడం హర్షణీయమన్నారు. అల్లూరి పోరాటాలు చేసిన పాడేరు ప్రాంతానికి ఆయన పేరు పెట్టిన పరాష్ట్ర ప్రభుత్వం, గిరిజన విశ్వ విద్యాలయానికి మల్లుదొర, గంటందొర పేర్లు పెట్టడం వలన వారిని ఎంతగానో గౌరవించుకున్నట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో అల్లూరి సంఘం సభ్యులు శ్యామల వరలక్ష్మి, ఎ.వరహాలరాజు, సత్యన్నారాయణ, గంటందొర, మల్లుదొర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దీపాలంకరణ





అనకాపల్లి మండలంలోని చిన్నబాబుకాలనీ వాటర్‌వర్క్స్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం రాత్రి దీపాలంకరణతో భక్తులు సందడి చేశారు. శివుడు, త్రిశూలం, స్వస్తిక్ తదితర ఆకృతుల్లో ఏర్పాటు చేసిన దీపాలు ఆకట్టుకున్నాయి.

- అనకాపల్లి టౌన్

విద్యాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. శనివారం అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమివ్వనున్నారని, లక్ష గాజులతో పూజలు నిర్వహించనున్నట్లు ఈవో కె.శిరీష చెప్పారు.

క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపోగేటు వద్ద సమావేశంలో కార్యదర్శి శ్రీను

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ) విజయనగరం జోన్ పరిధిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఎస్ఎస్ శ్రీను తెలిపారు. రెండో రోజైన శుక్రవారం స్థానిక గ్యారేజీ గేటు వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిష్మెంట్ బదిలీలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి 'జగనన్నే మా భవిష్యత్'

పరవాడ: మండలంలో రెండో విడత జగనన్నే మా భవిష్యత్ సంక్షేమ యాత్రను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ నెల 27 నుంచి నవంబరు 5 వరకు నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 27న వెన్నలపాలెం గ్రామం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. 28న కలపాక, 29న పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, 30న గొర్లివానిపాలెం, పెదముషిడివాడ, 31న పెదముషిడివాడ, నవంబరు 1న కన్నూరు, మడకపాలెం, మామిడివానిపాలెం ఇ.మర్రిపాలెం, లంకెలపాలెం, 2న భర్నికం, తానాం, 3, 4, 5వ తేదీల్లో పరవాడ గ్రామంలో సంక్షేమ యాత్ర నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వేదపండితులు

కోటవురట్ల: స్థానిక సంతబయలు వద్ద రామాలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. శుభ ముహూర్తాన రాములోరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా భక్తజనం తరలివచ్చారు. ఈ ఆలయాన్ని టీటీడీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,214 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,900	4,280
రెండో రకం	3,850	4,150
మూడోరకం	3,410	3,840

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-7 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 363 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.


సరస్వతీ నమస్తుభ్యం వరదే అక్షర రూపిణీ

శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు వాగ్దేవతామూర్తి సరస్వతీదేవిగా శ్వేత వస్త్ర ధారిణియై భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం జగన్మాత జన్మనక్షత్రం. దీంతో ఊరూవాడా అమ్మవారి ఆలయాలు, విగ్రహాలను కొలువుదీర్చిన మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విద్యార్థులు సరస్వతీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకుని, విద్యాబుద్ధులు కోరుతూ ప్రత్యేక పూజలు జరిపారు. పలు చోట్ల అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కొన్ని చోట్ల అమ్మవారిని కనకదుర్గ, భద్రకాళి, వ్యాఘ్రవాహిని రూపంలో అలంకరించి, పూజించారు.



నూకాంబిక బాలాలయంలో హోమం

- అక్షరాభ్యాసాలతో ఆలయాలు కిటకిట
- వ్యాఘ్రవాహిని అలంకరణలో కన్యకాపరమేశ్వరి
- నూకాంబిక బాలాలయంలో ప్రత్యేక పూజలు



వ్యాఘ్రవాహినిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



భద్రకాళి అవతారంలో గౌరీదేవి



సరస్వతీదేవిగా సత్యనారాయణపురం కనకదుర్గమ్మ



కశింకోట వద్ద సరస్వతీదేవి అవతారంలో కనకదుర్గమ్మ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో సువాసిని పూజలో మహిళలు



చిన్నబాబుకాలనీ దుర్గమ్మకు సరస్వతీదేవి అలంకరణ



బాలాలయంలో అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు



గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ సన్నిధిలో దాడి రత్నాకర్



కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగాయి. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాలు భక్తుల పూజలు, దేవీ నామ స్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు, హోమాలు చేశారు. పలు చోట్ల అన్నసమారాధనలు జరిపారు.

నూకాంబిక బాలాలయంలో..

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమపూజలు, హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ దంపతులు, ధర్మకర్త గొల్లవిల్లి నర్సింగరావు దంపతులు అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం సరస్వతి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. సరస్వతీ పూజ సందర్భంగా నెల్లూరు నానాజీ, మాధురిలక్ష్మీ, కర్రి వెంకటరమణబాబు, లక్ష్మీతులసి దంపతుల ఆర్థిక సాయంతో విద్యార్థులు పెన్నులు, పుస్తకాలు, పలకలు, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలాధారులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. రాత్రి 7 గంటలకు సిరిస్పందన నృత్యాలయం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భద్రకాళిగా గౌరీపంచాయతన అమ్మవారు

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి భద్రకాళిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన జరిపారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కన్నెపిల్లలు, సంతానం లేని మహిళలచే సామూహిక సహస్రనామ పూజ, కిస్‌మిస్‌లతో అర్చన చేశారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వ్యాఘ్రవాహినీదేవిగా కన్యకాపరమేశ్వరి

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు వ్యాఘ్రవాహినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో సామూహిక సువాసిని పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవాసవీ మహిళా భక్త సంకీర్తన కళాదర్బార్ వారిచే అమ్మవారి భక్తి సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అవతారంలో కామాక్షిదేవి

నిదానందొడ్డి కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవిని సరస్వతీ దేవిగా అలంకరించి, భక్తులకు దర్శనమిప్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని సత్యనారాయణపురం, తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, గొలగాం, సీతానగరం తగరంపూడి, వెంకుపాలెం, మామిడిపాలెం, కుంచంగి తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద భక్తులు బారులు తీరారు.

683 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం

స్థానికంగా ప్రసిద్ధి చెందిన సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం వేకువజాము నుంచే ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. అయిదువేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 683 మంది చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు రత్నాకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. అమ్మవారి ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, చైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు, ధర్మకర్త బోయిన రమణాజీ, సభ్యులు కరణం నాయుడు, రాయపరెడ్డి రామచంద్రరావు, అప్పారావు, కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు వరహాలబాబు, వార్డు సభ్యుడు దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట వద్ద జాతీయ రహదారి పక్కన వేంచేసిన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ భక్తులు ఎక్కువగా అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

శాస్త్రీయ ప్రణాళికతో ఉపాధి పనులు

- ఉపాధి పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీలో ఏపీడీ రోజారాణి



ప్రజా వేదికలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా ఏపీడీ రోజారాణి

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను వచ్చే ఏడాది నుంచి శాస్త్రీయ ప్రణాళిక మేరకు నిర్వహించనున్నట్లు డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రోజారాణి తెలిపారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక శుక్రవారం జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.9.98 కోట్లతో నిర్వహించిన ఉపాధి పనులకు సంబంధించి 27 గ్రామ పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను ఇక నుంచి శాటిలైట్(గూగుల్) ద్వారా గుర్తించి శాస్త్రీయ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ ప్రణాళిను వచ్చే నెల నవంబర్‌లోగా సిద్ధం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నిర్వహణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చేసిన తప్పులు పునరావృతం కారాదన్నారు. పారదర్శకంగా పనులు నిర్వహించాలన్నారు. కూలీల మస్తర్లు దిద్దుబాట్లు చేయరాదన్నారు. యాప్‌లో రోజు వారీ డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అవకతవకల మేరకు రూ.17,262 రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న జాబ్ కార్డు గల ఉపాధి కూలీలకు 90 రోజుల పని దినాలు కల్పిస్తున్నారని, వీటిటి రోజుకు రూ.272 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయితే సామాజిక తనిఖీ పూర్తి కాకుండా రెండు అంతస్తుల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఈ సొమ్ము చెల్లింపు నిలిపి వేయాలని ఆదేశించారు. జిల్లా రీసోర్స్ పర్సన్లు తమ సిబ్బందితో గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను, వాటిలో లోటుపాట్లను సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, క్లస్టర్ ఏపీడీ మణికుమార్, మండల వైస్ చైర్మన్ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఏపీవో శివ, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు, మండల ఇంజినీర్ లక్ష్మణరావు, ఫీల్డు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ సత్యవతి



దేవీనగర్ నూతన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి దేవీనగర్‌లో ఎంపీ నిధులతో అభివృద్ధిచేసిన పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెనలు, డ్రైనేజీ పనులు పూర్తి అయిన సందర్భంగా త్వరలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న శారదానది ఒడ్డున గల దొంగగెడ్డ(దేవీనగర్)పై వంతెనలకు రూ.20 లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడంతో, పనులు త్వరితగతిన పూర్తయ్యాయన్నారు.

భారీ వర్షాల కారణంగా సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో కొండపై నుంచి శారదానదిలో కలిసే దొంగగెడ్డపై బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకోవడంతో దేవీనగర్, మూలపేట, సత్యనారాయణపురం ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎంపీ నిధులతో వీటిని అభివృద్ధి చేసి, ప్రజల రాకపోకలకు వీలుగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, పంచాయతీరాజ్ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పెదరెల్లివీధి సచివాలయం పరిధి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం వరకూ నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటింటి సమగ్ర సర్వేలో రక్త పరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెదరెల్లివీధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

కశింకోట: మండలంలోని అచ్చెర్ల సచివాలయంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని, రోగుల్ని పరీక్షించి, అవసరమైన మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు

రాంబిల్లి: శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునని ఏవో సి. సుమంత అన్నారు. దిమిలిలో శుక్రవారం వరి పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనలు మేరకే ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలన్నారు. సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మేఘన, ప్రశాంతి, ఎంపీఈవో రామారావు పాల్గొన్నారు.

జీవితంలో రాణించాలంటే రాజీ పడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస శిక్షకుడు నాగిరెడ్డి దారపు

అనకాపల్లిటౌన్: రాజీ పడకుండా జీవితాన్ని ఉత్తమ మార్గం వైపు సాగేలా కృషి చేయాలని వ్యక్తిత్వ వికాస శిక్షకుడు నాగిరెడ్డి దారపు కోరారు. అనకాపల్లి డైట్ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సరైన మనస్తత్వం, సానుకూల దృక్పథం మాత్రమే జీవితంలో విజయం సాధించేందుకు దోహదపడతాయన్నారు. జీవితంలో బాగా ఎదగాలంటే ఏ రంగంలో దృష్టి సారించాలి, అందుకు అనువైన బలాలను గుర్తించడంలో మెలకువలను వివరించారు. డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా తమ ఆశయాలను త్వరితగతిన సాధించుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి పల్లా వెంకటమురళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యం

- ఉద్యమంలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- పోటెత్తిన రోగులు.. వైద్య సేవలపై హర్షం



ఎన్టీఆర్ క్రీడామైదానం శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సునీత



గొలగాంలో రోగికి మందులు అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

అనకాపల్లిటౌన్: బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, దశలవారీగా వాటిని పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, ఎంపీపీ గొర్లి సూరిబాబులు అన్నారు. పట్టణంలోని బాలాజీరావుపేట సచివాలయం పరిధి ప్రజలకు ఎన్టీఆర్ క్రీడామైదానంలోను, మండలంలోని గొలగాం గ్రామానికి సంబంధించి స్థానిక ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను వేర్వేరుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యంలో చారిత్రాత్మక నిర్ణయాలతో ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో దేశంలో ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేసిన దాఖలాల్లేవన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందన్నారు. వైద్యశిబిరంలో ఉచితంగా రక్తపరీక్షలు, బీపీ, సుగర్, ఆరోగ్య పరీక్షలు చేయడమే కాకుండా, పెద్దపెద్ద వ్యాధులకు ఆరోగ్య శ్రీలో అక్కడే నమోదు చేసి రోగి కోరుకున్న కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చి, ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ప్రజల కోసం ఇంతగా కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న సార్వత్రి ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. అమెరికా పర్యటన ముగించుకుని సురక్ష వైద్య శిబిరానికి విచ్చేసిన 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులను పార్టీ పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీడీవో కె.నరసింహరావు, ఈవోఆర్డీ ధర్మారావు, సీడీపీవో కె.ప్రభావతి, గొలగాం గ్రామ సర్పంచ్ సాలపురెడ్డి నాగనరసింహారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నాయకులు గైపూర్ రాజు, పసుపులేటి రామకృష్ణ, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వీసీ ఆచార్య సూర్యప్రకాశరావుకు ఘన సత్కారం

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఏయూ న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య దాసరి సూర్యప్రకాశరావును ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ న్యాయ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కలిగిన ఆచార్య సూర్యప్రకాశరావును డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతిగా నియమించడం ప్రతిభకు పట్టం కట్టినట్లయ్యిందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత సేన అధ్యక్షుడు ఐడీబాబు, స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, కో ఆర్డినేటర్ ఎస్వీ రాజారెడ్డి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, కె. సూర్యనారాయణ తదితరులు సత్కరించినవారిలో ఉన్నారు.